ప్రమాదకరంగా ప్రయాణం

- ప్రైవేటు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులు
- టాప్‌లపై కూర్చొని ప్రయాణం
- అడ్డూ అదుపు లేకుండా వేగం


ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఆటో ట్రాలీ (ఫైల్)


పరిమితికి మించి జనాలతో వెళ్తున్న టాటా మ్యాజిక్

దుమ్ముగూడెం: మండలంలో పలు వాహనాలు అధిక లోడ్లతో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నాయి. అయినప్పటికీ సదరు వాహన యజమానులు, డ్రైవర్ల తీరులో మార్పు రావడం లేదు. ఆటోలు, టాటా మ్యాజిక్‌లు, బొలెరోలలో పరిమితికి మించి మనుషులను ఎక్కిస్తూ ప్రయాణాలు చేస్తున్నారు. ప్రస్తుతం మండలం మీదుగా ఇసుక లారీలు అతి వేగంతో ప్రయాణిస్తున్నాయి. ఈ క్రమంలో పరిమితికి మించిన జనంతో ప్రయాణిస్తున్న ఆటోలకు, టాటా మ్యాజిక్‌లకు ప్రమాదాలు జరిగితే ఆ నష్టం ఊహించని విధంగా ఉంటుంది.

వ్యవసాయ సీజన్ కావడంతో..

ప్రస్తుతం మండలంలోని ప్రతీ మారుమూల గ్రామానికి మండల ప్రధాన గ్రామం అనుసంధానిస్తూ రహదారి సౌకర్యాలు ఉన్నాయి.దీంతో వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తున్నాయి. వ్యవసాయ సీజన్ కావడంతో కూలీలను మండలంలోని సరిహద్దు గ్రామాలతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని వివిధ గ్రామాల నుంచి తీసుకునివస్తున్నారు. ఆటో వాలాలు, బొలెరో వాహనదారులు గ్రామాల్లోకి వెళ్లి కూలీలను మాట్లాడుకుని అప్ అండ్ డౌన్ అదే వాహనంలో వచ్చేలా రేటు మాట్లాడుకుంటారు. ఈ నేపథ్యంలో సదరు వాహన డ్రైవర్, యజమాని మండలంలో కూలీలను పరిమితికి మించి ఎక్కించుకుని తీసుకునివస్తుంటారు. ఈ క్రమంలో అక్కడక్కడ చిన్న చిన్న ఘటనలు జరిగి స్వల్ప గాయాలతో బయటపడిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటి వరకు పెద్ద ప్రమాదాలు జరగనప్పటికీ.. జరగకూడనిది జరిగితే పర్యావసనం తీవ్రం ఉంటుంది.

తనిఖీలు శూన్యం..

ఏజెన్సీ మండలమైన దుమ్ముగూడెంలో ఆర్టీఏ అధికారులు పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టకపోవడంతో వాహనదారులు ఇష్టం వచ్చిన రీతిలో అధిక లోడ్లతో ప్రయాణాలు సాగిస్తున్నారు. వాహనాల్లో అధికంగా జనాభాను ఎక్కించుకుని ముందు వెళ్లే వాహనాలను అధిక స్పీడ్‌తో ఓవర్ టేక్ చేస్తున్న ఘటనలు కోకొల్లలు. మండల వ్యాప్తంగా ఉన్న ఆటోలకు, బొలెరోలకు, ట్రాక్టర్లకు సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా, నంబర్ ప్లేట్ లేకుండా ద్విచక్ర వాహనాలు రోడ్లపై తిరుగుతున్నా.. సంబంధిత శాఖ అధికారుల తనిఖీలు లేకపోవడంతో వారి ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు చేపట్టి కఠినమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తాం..



మండలంలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తాం. పరిమితికి మించి వాహనాల్లో జనాలను తరలిస్తే ప్రమాదాలు జరుగుతాయి. దానికి వాహన యజమాని బాధ్యుడు అవుతాడు. వాహనాలలో పరిమితికి మించి జనాలను ఎక్కించుకుని రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తాం.

– సంగెం వెంకటపుల్లయ్య, భద్రాచలం ఎంవీఐ

క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో శుక్రవారం అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రత్యేకంగా కలిశారు. ముందుగా పలు అభివృద్ధి, సమస్యలపై సీఎంకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం మూడు గ్రామ పంచాయతీల విలీనంతో కొత్తగా అశ్వారావుపేట మున్సిపాలిటీని ఏర్పాటు చేయడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మున్సిపాలిటీ కార్యాలయానికి భవనం నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయాలని వినతి చేశారు. దీంతో సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ సమావేశానికి హాజరయ్యారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

భద్రాచలంటౌన్: వాహనలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడంతో పాటు సీట్ బెల్టు పెట్టుకోవడం అందరి బాధ్య అని భద్రాచలం మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య తెలిపారు. స్థానిక ఆర్టీఏ కార్యాలయ ఆవరణలో రోడ్డు భద్రత సదస్సులో ఆయన శుక్రవారం రోడ్డు భద్రతా నియమాల ఆవశ్యకతను వివరించారు. బాధ్యత గల పౌరులుగా తప్పకుండా సీట్ బెల్ట్, హెల్మెట్ పెట్టుకొని ప్రయాణం చేయాలని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేస్తున్న వారికి నమస్కారం చేసి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు.

అమలుకు నోచుకోని హామీలు

చర్ల: రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల హామీలతో అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఏ ఒక్కటీ అమలుకు నోచుకోవడం లేదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ విమర్శించారు. శుక్రవారం చర్లకు వచ్చిన ఆయన చర్లలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్ల నుంచి వెంకటాపురం వరకు ఉన్న రహదారి, తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు కింద రబీలో సాగు చేసిన పంటలకు సాగునీరు విషయంలో స్థానిక ఎమ్మెల్యే వెంకట్రావ్‌కు, కాంగ్రెస్ పెద్దలకు పట్టడం లేదని విమర్శించారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, నాయకులు ఎస్‌డీ అజీజ్, పంజా రాజా, తడికల బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

'పిన్నింగ్' వేడుక..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ఐటీడీఏ ప్రాంగణంలోని ఎమ్‌పీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) ట్రెనింగ్ సెంటర్‌లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం పిన్నింగ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎస్‌ఎల్ కాంతారావు పాల్గొని మాట్లాడారు. నర్సింగ్ వృత్తి పవిత్రమైనదని, ట్రైనింగ్‌లోనే విద్యార్థులు అన్ని విషయాలపై పూర్తి అవగాహన చేసుకోవాలని సూచించారు. సమాజంలో నర్సింగ్ పాత్ర చాలా విలువైందని, వృత్తి పట్ల అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ట్రెనింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ చైతన్య, కృష్ణయ్య, ఆత్మలక్ష్మి, సుశీల పాల్గొన్నారు.

గాయత్రీదేవి కల్యాణం

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం ప్రాంతంలో కొలువై ఉన్న పంచముఖ వేదగాయత్రీదేవి అమ్మవారి దేవాలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు అనంతరం శాంతి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అక్కినేపల్లి వసంతాచార్యులు, అర్చకులు ప్రదీప్ శాస్త్రీ మంత్రోచ్చరణల నడుమ వైభవంగా జరిపించారు. అమ్మవారి శాంతి కల్యాణాన్ని భక్తులు తిలకించారు. అనంతరం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

షిఫ్ట్ మార్పులకు అవకాశమివ్వాలి

మణుగూరుటౌన్: మార్చి 2వ తేదీ నుంచి ప్రారంభం కాబోయే రంజాన్ పండుగ ఉపవాస దీక్షలకు పురస్కరించుకుని ఆయా గనులు, డిపార్ట్‌మెంట్‌లలో ఉపవాసాలు చేసే ముస్లిం కార్మికులకు షిఫ్ట్ వేళల్లో మార్పులకు అవకాశమివ్వాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు. శుక్రవారం ఈ మేరకు జీఎం కార్యాలయంలో ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్‌కి వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ.. రంజాన్ ఉపవాస దీక్షను నిర్వర్తించాలని సంకల్పం ఉన్నప్పటికీ వారి పని సమయ వేళలను దృష్టిలో పెట్టుకుని ఉపవాస దీక్షలు చేపట్టలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో బంగారి పవన్ కుమార్, రమేశ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణ పరిశీలన


మట్టి సేకరణ తీరును పరిశీలిస్తున్న అధికారులు

గుండాల: గత పది రోజులుగా మండలంలో జరుగుతున్న మట్టి నమూనా సేకరణను వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఎస్ఎల్‌యూఎస్ఐ బృందం ఆధ్వర్యంలో మండలంలో లింగగూడెం, మామకన్ను మట్టి నమూనా సేకరణ అయిపోయిందని ప్రస్తుతం కాచిన పళ్ళు జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు తెలిపారు. ఈ మట్టి నమూనా సేకరణ అనంతరం పరీక్షలు చేస్తామని వివరించారు. పంటలు సాగు చేసే ముందు భూసార పరీక్షలు తప్పనిసరి అని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ తాతారావు, ఏవో వెంకటరమణ, ఏఈవోలు బాలరాజు రైతులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి


కల్లంలో మిర్చిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బూర్గంపాడు: మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మిర్చి కల్లాలను శుక్రవారం సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించి రైతులతో మాట్లాడింది. ఆరుగాలం శ్రమించి పండించిన మిర్చి పంటకు ధర లేకపోవటంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని బృందం సభ్యులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించకపోవటంతోనే ఈ పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని వెల్లడించారు. మిర్చికి క్వింటాకు రూ.25వేలు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాండవుల రామనాథం, రాయల వెంకటేశ్వర్లు, బయ్యా రాము,కందుకూరి నాగేశ్వరరావు,గుంటక కృష్ణ, కత్రి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఆదరణ పెరుగుతోంది..


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: గ్రామీణ స్థాయి నుంచి అన్ని ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గాండ్లగూడెం గ్రామంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి 15 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో హామీలు అమలు కాకపోవడం, సంక్షేమ పథకాలు అందకపోవడంతో ప్రజలంతా బీఆర్ఎస్ హయంలో జరిగిన పాలన, అభివృద్ధిని గుర్తు చేస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో పార్టీలోకి మరిన్ని చేరికలు ఉంటాయని, భవిష్యత్ బీఆర్ఎస్ పార్టీదేనని తెలిపారు. అనంతరం వినాయకపురం గ్రామంలో కొద్ది రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిన ఇంటిని పరిశీలించి బాధితురాలు భార్గవికి బియ్యం, వంట సామాగ్రిను అందించారు. అలాగే పెదవాగు ప్రాజెక్ట్ గ్రామానికి చెందిన వేంపాటి సోములు, ఊట్లపల్లి గ్రామానికి చెందిన కేతా లాస్య అనే చిన్నారి ఇటీవలె మృతి చెందగా, వారి కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకులు మండపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, చందా లక్ష్మీనర్సయ్య, జక్కుల రాంబాబు, సత్యవరపు సంపూర్ణ, ఉప్పల ప్రసాద్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ క్షేత్ర పరిశీలన


ఆయిల్‌పామ్ క్షేత్రాన్ని కొండరెడ్లతో కలిసి పరిశీలిస్తున్న నాయకులు

దమ్మపేట: మండల పరిధిలోని పూసుకుంట గ్రామంలో కొండరెడ్లు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ వ్యవసాయ క్షేత్రాలను, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కొండరెడ్లతో కలసి శుక్రవారం పరిశీలించారు. సాగులో అవలంబించాల్సిన విధానాలు, మెళకువలు, అనుకూలమైన అంతర పంటలను గురించి కొండరెడ్లకు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా కొండరెడ్లు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా త్రీ ఫేజ్ కరెంటు, నీటి బోర్లు లేక వ్యవసాయానికి అవస్థలు పడుతున్న తమకు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చొరవ తీసుకున్న కారణంగానే రైతులు అందరికీ ఐటీడీఏ భద్రాచలం వారి ద్వారా ఉచిత సాగు నీటి బోర్లు వేయడం జరిగిందని అన్నారు. బోర్లకు అవసరమైన సబ్‌మెర్సిబుల్ విద్యుత్ మోటార్లను కూడా ఉచితంగానే అందజేశారని అన్నారు. దీనితో పాటుగా ఆయిల్‌పామ్ సాగుకు అవసరమైన మొక్కలు, వాటిని నాటడం, బిందు సేద్య పరికరాలు అన్ని ఐటీడీఏ నిధులతోనే రైతులకు ఉచితంగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కే.వి.సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, కాంగ్రెస్ నాయకులు ఎల్లిన మురళి, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు, కొండరెడ్లు నాగిరెడ్డి, రాజిరెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో శిక్ష

దమ్మపేట: దమ్మపేట కోర్టులో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తులకు జైలు శిక్షతో పాటుగా జరిమానా విధించారు. దమ్మపేట జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులకు నాలుగు రోజుల జైలు శిక్షతో పాటుగా రూ.2000ల జరిమానాను విధించారు. మరో ఐదుగురు వ్యక్తులకు రెండు రోజుల సామాజిక సేవతో పాటుగా రూ.1000ల జరిమానా విధించారు.

సైబర్ నేరాలపై అవగాహన

చంద్రుగొండ: మండల కేంద్రం చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై ఏఎస్ఐ పాపారావు శుక్రవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనేక రకాలుగా మోసాలకు పాల్పడుతున్న వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గౌడ సంఘం కమిటీ ఎన్నిక

దమ్మపేట: మండల గౌడ సంఘం కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం మండల కేంద్రం దమ్మపేటలో గౌడ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడిగా బంధం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా చిలకబత్తుల ఏసుబాబు, గౌరవ అధ్యక్షుడిగా పానుగంటి రాంబాబు, ముఖ్య సలహాదారుడిగా యార్లగడ్డ ఈశ్వరరావును ఎన్నుకున్నారు.

111శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్

మణుగూరుటౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలో ఫిబ్రవరి నెలకు సంబంధించి 111 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైనట్లు ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జీఎం కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు.ఫిబ్రవరిలో 11.16లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 12.38లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని తెలిపారు. అలాగే, ఓబీ వెలికితీత 14.0లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 13.53 లక్షల క్యూబిక్ మీటర్లు(97శాతం) వెలికితీసినట్లు, రైలు, రోడ్డు, రోప్‌వే మార్గాల ద్వారా 11.79 లక్షల టన్నులు రవాణా చేసినట్లు తెలిపారు. కాగా, స్థానిక లారీలకు మరో 10 రోజుల తర్వాత లోడింగ్ కల్పిస్తామని తెలిపారు. రిటైర్డ్ కార్మికులు పెన్షన్ కోసం ఈనెల 31వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. సమావేశంలో అధికారులు వెంకట్రావు, వెంకటేశ్వర్లు, సలగల రమేశ్, అనురాధ, రాజు, సింగు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయ విద్యతో ఉన్నతస్థాయి


మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్

అశ్వారావుపేటరూరల్: నాలుగేళ్ల వ్యవసాయ విద్యా డిగ్రీ పట్టా అందుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరవచ్చని స్థానిక వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ సూచించారు. శుక్రవారం కళాశాలలో ఫ్రెషర్స్‌డే పార్టీ నిర్వహించారు. ముందుగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులంతా కలిసి ప్రథమ సంవత్సరం విద్యార్థులను ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి డీన్ మాట్లాడుతూ.. వ్యవసాయ విద్యతో ఎన్నో అవకాశాలు వస్తాయని, విద్యతోపాటు విజ్ఞానం పెరుగుతుందని అన్నారు. విద్యను క్రమశిక్షణతో పూర్తి చేస్తే ప్రతి విద్యార్థీ తాము ఉపాధి పొందడంతోపాటు వందలాది మందికి ఉపాధి మార్గాలు కల్పించే అవకాశాలు ఈ విద్యతోనే సాధ్యమన్నారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, పాటలతో సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే


అశ్వారావుపేటరూరల్: ర్యాలీ చేపడుతున్న టైలర్లు


అన్నపురెడ్డిపల్లి: కేక్‌కట్ చేస్తున్న టైలర్ల సంఘం నాయకులు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో టైలర్స్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. టైలర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో టైలర్స్ సంఘం నాయకులు యాకుబ్, నాగేశ్వరరావు, పుల్లయ్య, జానీ పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: టైలర్స్ డే వేడుకలను శుక్రవారం అశ్వారావుపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గెస్ట్ హౌజ్ ఆవరణలో ఆదర్శ టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించగా.. ముందుగా కుట్టు మిషన్‌ను కనుగొన్న విలియమ్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు పచ్చా సత్యనారాయణ,కూనా శ్రీనివాస్, పాత్రుని అప్పారావు, కొనకళ్ల శ్రీనివాస్, నాగరాజు, తాడేపల్లి సిద్దారావు, ఎస్‌కె.మౌలాలి, ఆరేపల్లి సాంబశివరావు, ఎస్‌కె.మైబూబీ, గుర్రాల స్వప్న, డేగల సుజాత పాల్గొన్నారు.

పదవీ విరమణ కార్మికుడికి సన్మానం


సమీంద్రాచారి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, కార్మిక సంఘాల నాయకులు

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–2లో శావేల్ ఆపరేటర్‌గా పని చేస్తూ పదవీ విరమణ పొందిన స్పెషల్ గేడ్ ఆపరేటర్ ఆకారపు సమీంద్రాచారి–యశోద దంపతులను అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఆపరేటర్లు, సహోద్యోగులు శుక్రవారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలతో సత్కరించారు.

ఈ సందర్భంగా గని మేనేజర్ కె సురేష్ కుమార్ మాట్లాడుతూ.. 35 సంవత్సరాలకు పైగా సింగరేణి సంస్థకు సమీంద్రాచారి అందించిన సేవలను కొనియాడారు. సమీంద్రాచారి విశ్రాంత జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు మధుసూధన్, రిలే సి ఇన్‌చార్జ్ భూక్యా భాంగ్యా, బి.రామదాస్, బి.బాబ్జీ, కార్మిక సంఘాల నాయకులు సురేందర్, జానకి ప్రసాద్, వత్సవాయి కృష్ణంరాజు, మిద్దెపాక శ్రీనివాస్, రిలే సి ఆపరేటర్లు, కార్మికులు, సూపర్‌వైజర్లు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో రామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల సైన్స్ ప్రదర్శనలు చేయగా.. ఉపాధ్యాయులు తిలకించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన, ఇతర పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మూఢవిశ్వాసాలపై సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: సైన్స్ డే సందర్భంగా మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ స్పందన


బూర్గంపాడు: సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు


చర్ల: రామన్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయుల నివాళి..


దమ్మపేట: జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఎంఈఓ, హెచ్ఎం


చంద్రుగొండ: విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు


కరకగూడెం: సీవీ రామన్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థుల నివాళి..



అన్నపురెడ్డిపల్లి: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఆనంద్‌కుమార్